# నటించకు

అటువంటి ఉత్తరం వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు నేను. కానీ వచ్చింది. ఆరోజు సాయంత్రం ఆఫీసునించి తిరిగివచ్చి గది తలుపులు తెరిచిన నీరజ కళ్లకు పోస్ట్‌మేన్‌చేత కిటికీలోనించి లోపలకు విసిరివేయబడిన ఆ ఉత్తరం దర్శనమిచ్చింది.

ఉత్తరంమీది దస్తూరీ చూడగానే ఆ ఉత్తరం పేరిందేవి దగ్గర్నించి వచ్చిందని తెలుసుకున్నది. దాదాపు ఆరునెల్ల తర్వాత వచ్చిన ఉత్తరం.

ఆత్రంగానే కవర్ని చింపి కాయితాన్ని బయటకు లాగి గబగబా చదివింది. తర్వాత నీరసంగా కుర్చీలో వెనక్కు వాలింది. ఇప్పుడేమిటి చెయ్యటం?

మరోసారి ఆ ఉత్తరాన్ని చదివింది నీరజ.

డియర్ నీరూ – చాలాకాలం తర్వాత నిన్ను చూసే అవకాశం కలుగుతున్నందుకు సంతోషంగా వుంది. ఆదివారం బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు వస్తున్నాను. అక్కడినించి ఖమ్మం వెళతాను. రైలు మారటానికి ఓ అరగంట వ్యవధి వుంటుంది.

ఈ వ్యవధిలో మనం ఎన్నో మాట్లాడుకోవాలి. నువ్వొక్కదానివే కాదు. నిన్ను పంచుకునే నీ పతిదేవుడ్ని కూడా తీసుకునిరా. మీ ఇద్దర్నీ చూడాలని నాకు ఆత్రంగా వుంది. ఎందుకంటే నేను కూడా నా పతిదేవుడితో వస్తున్నాను. నువ్వు కూడా ఆయన్ని ఇంతవరకూ చూడలేదు కదా! సరదాగా ఓ అరగంట గడుపుదాం.

కేవలం నిన్నూ, నీ భర్తనీ చూడాలనే ఈ విజయవాడ మార్గాన్ని ఎంచుకున్నాను. లేకపోతే హైద్రాబాద్ నుండి ఖమ్మం వెళ్లేవాళ్ళం. డోన్ట్ మిస్ నీరజా. బై.

ఆ ఉత్తరాన్ని మళ్ళీ చదివిన నీరజకు గుండెలు అదిరాయి. పేరిందేవి దగ్గర్నించి అలాంటి ఉత్తరం వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. అనుకున్నట్లయితే తన జీవితం గురించి అలాంటి కల్పనకు సాహసించేది కదేమో! కానీ – ఇప్పుడయినా పేరిందేవిని కలిసి నిజాన్ని చెబితే! అనవసరమేమో. తన గురించి ఆమెకు వున్న అభిప్రాయాన్ని పోగొట్టుకున్నట్లవుతుంది. కేవలం పేరిందేవితో రైలు స్టేషన్‌లో గడిపే అరగంటకోసం బయటపడి ఆమె దృష్టిలో తాను చులకన కాకూడదు.

ఇలా అనుకున్నదే గానీ తనకు వచ్చిన ఆ సమస్యకు పరిష్కారం ఏమిటో నీరజకు తెలీలేదు.

ప్రస్తుతానికి ఇంట్లో తల్లి లేస్త్ర. నాలుగు రోజుల క్రితం తను సొంత ఊరు వెళ్ళింది. తను కన్న మిగిలిన సంతానాన్ని చూడటానికి – ఆమె వున్నా ఏమిటి ప్రయోజనం? తన సమస్యను ఆమెతో చెప్పలేదు. నిజానికి తన సమస్యకు కారణం ఆమె కాదూ?

కుర్చీలోనించి లేచి స్నానం చేసి వచ్చింది. తర్వాత అరగంటకు వంటపని కూడా పూర్తిచేసింది. ఇంత చేసినా ఏడు గంటలు దాటలేదు.

గదిలో ట్యాబ్‌లైటు ప్రకాశవంతంగా వెలుగుతోన్నది. తలుపుల మధ్యనించి గాలి చాలా జోరుగా లోపలకు వస్తోన్నది.

నీరజకు మళ్ళీ ఆ ఉత్తరం గుర్తుకొచ్చింది.

ఈసారి ఆమెకు నవ్వు పుట్టుకొచ్చింది.

తన జీవితాన్ని పంచుకునే తన పతిదేవుడ్ని కూడా తీసుకురావాలిట. ఎవరా పతిదేవుడు? అసలు లేనిదే? ఇంకా తనకు పెళ్ళి కానిదే?

ఐనా పేరిందేవి అలా రాయటంలో తప్పేముంది? తనకు పెళ్ళయ్యిందనీ, తన భర్త తనని స్వర్గంలో ముంచి తేల్చుతున్నాడనీ ఎన్నో ఉత్తరాలు పేరిందేవికి రాసింది. ఆ విధంగా తను తనకు లేని భర్తను సృష్టించి రాసిన ఉత్తరాల పర్యవసానమే ఇప్పుడీ ఉత్తరం.

తన తల్లి నిజానికి తనతోపాటు ఇద్దరు చెల్లెళ్లనీ, ఓ తమ్ముడినీ అవలీలగా కనిపారెయ్యకపోతే తనకు ఇలాంటి అబద్ధపు ఉత్తరాలను పేరిందేవిలాంటి వాళ్ళకి రాసే గతి పట్టివుండేది కాదు. తన తండ్రి చనిపోకపోతే తనూ అందరిలాగే పెళ్ళి చేసుకుని నిజంగానే తన సంసారం గురించి ఉత్తరాలు రాసుకునేది.

తన మేనమామ మంచివాడు కాబట్టి ఇంట్లో వుంచుకుని డిగ్రీ దాక తనని చదివించాడు. తను కుటుంబ ఆలనాపాలనా చూశాడు. తనకే మగపిల్లలున్నట్లయితే తనని కోడలిగా చేసుకునేవాడినన్నాడు. తర్వాత ఆయనా తన తండ్రి దగ్గరికే పోయాడు. తను ఎట్లాగో కష్టపడి ఓ ఉద్యోగం సంపాదించుకున్నది.

తనకు ఉద్యోగం వచ్చిన రోజు తల్లి చాలా సంతోషించి తన చెల్లెళ్ళూ, తమ్ముడూ కూడా ఆనందించారు. తనూ సంతోషించింది. అప్పటికే తను పుట్టి పాతికేళ్ళు దాటిపోయింది. ఉద్యోగం వచ్చిన నాలుగు నెలలకు తనకో సంబంధం వచ్చింది. కనీసం తన అభిప్రాయం తెలుసుకోకుండానే తల్లి ఇప్పట్లో తన పెళ్ళి చేసే ఆలోచన లేదని వాళ్ళతో స్పష్టంగా చెప్పేసింది.

నిజంగా తను అప్పుడే చాలా బాధపడింది. తనకు ఉద్యోగం వచ్చినందుకు తన ఉద్యోగమే తన పెళ్ళికి అడ్డుగా నిలుస్తున్నప్పుడు తనెలా ఫీలవ్వాలి?

ఆ రాత్రి తను మౌనంగా వుండటం గమనించి తల్లి తన పెళ్ళి గురించిన నిర్ణయాన్ని తెలియజేసింది. తను పెళ్ళి చేసుకుని మొగుడితో కాపురానికి వెళ్ళిపోతే తన సంసారం వీధిన పడుతుందిట. ముందుగా పుట్టినందుకు ఆడయినా, మగయినా కుటుంబ బాధ్యతలు చచ్చినట్టు మొయ్యటం న్యాయమన్నది.

మిగిలిన పిల్లలు ఓ దారికొచ్చేవరకూ పెళ్ళి గురించిన ఆలోచన పెట్టుకోవద్దనీ, మనసు పాడుచేసుకోవద్దనీ తల్లి మనసుతో చెప్పింది. అందుకే ఈ జన్మకు పెళ్ళి విషయం మరిచిపోవాలనుకున్నది. త్యాగరాణిగానే తన జీవితం ముగిసిపోవాలనుకున్నది.

మరి అలాంటప్పుడు తనకు పెళ్ళయిందనీ, తన భర్త తనకు స్వర్గాన్ని చూపిస్తున్నాడనీ కల్పించి పేరిందేవికి ఎందుకు అలా ఉత్తరాలు రాసింది? అందుకు ప్రధాన కారణం పేరిందేవే.

నీరజ ఆలోచనలకు అంతరాయం కలిగింది.

చేతిలో పాలగిన్నెతో లోపలకు వచ్చింది ఇంటామె.

"గ్యాస్ ఇప్పుడే అయిపోయింది నీరజా - కాస్త మీ స్టవ్ మీద వేడిచేసివ్వు" అన్నది.

ఐదు నిముషాల్లో ఆమె అక్కడినుండి వెళ్ళిపోయింది.

కాసేపటి తర్వాత గదికి తాళంపెట్టి డాబామీదకు వెళ్ళి పిట్టగోడమీద కూర్చుంది నీరజ.

వెన్నెలగా వుంది. దూరంగా వెలుగుతున్న వీధిదీపం వెలుతురు కొంచెం డాబామీదకు పడుతున్నది. గాలికి నీరజ ముంగురులు ఎగురుతున్నాయి.

మళ్ళీ పేరిందేవి ఉత్తరం గుర్తుకు వచ్చింది.

పేరిందేవి డిగ్రీలో తన క్లాసుమేటు. తండ్రి ఏదో ఉద్యోగం చేసేవాడు. అందంగా వుండేది. బాగా చదివేది. తనతో బాగా స్నేహంగా వుండేది. డిగ్రీ పూర్తయిన తర్వాత ఇద్దరూ విడిపోయారు. విడిపోకముందు జీవితం గురించి, తను కనే రంగుల కలల గురించి మనసులో ఏదీ దాచుకోకుండా చెబుతూ వుండేది.

ఓ అందమైన రాజకుమారుడిని తను ప్రేమిస్తుందిట. అతన్నే పెళ్ళి చేసుకుంటుదిట. జీవితాంతం అతని కళ్ళల్లోకి చూస్తూ హాయిగా బతుకుతుందిట.

తనకు నవ్వొచ్చేది. ఓ రోజు తన గురించి అడిగింది. అలాంటి కోరికలేమీ తనకు లేవనీ, ఎవరో ఒకర్ని పెళ్ళి చేసుకుని సుఖంగా వుండాలని వుందనీ చెప్పింది.

రెండేళ్ళ క్రితం తన పేరున తన సొంత ఊరి ఎడ్రసుకు పేరిందేవి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఆశ్చర్యం కలిగింది. ఆ ఉత్తరాన్ని చదివాక మొత్తానికి పేరిందేవి జీవితంలో తను కోరుకు...్నది సాధించగలిగింది. ఆమెకు పెళ్ళయ్యిందని తను ప్రేమించినవాడితోనే. తనకు శుభలేఖను పంపిందిట. కానీ చేరలేదు. తన పెళ్ళియ్యిందా? అంటూ అందులో రాసింది.

నీరజ ఆ ఉత్తరానికి వెంటనే జవాబు రాయలేదు.

నెలరోజుల తర్వాత పేరిందేవికి ఉత్తరం రాసింది నీరజ. అందులో తను బాధ్యతల వలయంలో వున్నాననీ, ఈ జన్మకు తను పెళ్ళి చేసుకోలేదనీ రాయటం ఇష్టం లేకపోయింది. స్నేహితురాలి ముందు తన జీవితం వెలితి కాకూడదు. ఆమె తన మీద సానుభూతి చూపకూడదు.

తను కూడా పేరిందేవి దృష్టిలో సమానంగానే వుండిపోవాలి. అందుకే నాలుగు నెలల క్రితం తనకు పెళ్ళి అయ్యిందనీ, ఎడ్రసు సరిగ్గా తెలీకపోవడంవల్ల శుభలేఖను పంపలేకపోయాననీ, గుంతకల్‌లో వున్న స్నేహితురాలికి రాసింది.

వెంటనే శుభాకాంక్షలు తెలుపుతూ రాసింది పేరిందేవి. అందులో తన భర్త తనపట్ల చూపుతున్న ప్రేమనీ, అనురాగాన్నీ రంగరించి రాసింది.

తనూ వూరుకోలేదు. కొన్నాళ్ళకు తను కూడా తన భర్తతో స్వర్గంలో విహరిస్తున్నానని రాసింది.

ఇలా సాగుతున్నాయి వాళ్ళిద్దరి మధ్య ఉత్తరాలు.

ఇప్పుడీ ఉత్తరం వచ్చింది.

డాబామీదనించి కిందకి వచ్చింది నీరజ.

భోజనం చేసి పడుకుంది నీరజ. ఒక్కరోజు వ్యవధిలో వచ్చే పేరిందేవిని రైలు స్టేషన్లో తన భర్తతో కలిసి ఎలా కలుసుకోవాలో ఆమెకు అర్థంకాలేదు.

పడుకుని అలా ఆలోచిస్తున్నప్పుడు ఎవరో ఓ మగాడి సాయంతో పేరిందేవి ముందు ఆ అరగంటసేపూ పెళ్ళయినదానిలా నాటకం ఆడటం తప్పించి మరో మార్గం కనిపించలేదు నీరజకు.

మరి – తన భర్తగా నటించే ఆ మగాడు ఎవరు?

ఇది సాధ్యమేనా? తప్పదు. అంతకుమించి దారి లేదు. ఇన్నాళ్ళూ తను

కల్పించి రాసిన ఉత్తరాల్లో అబద్ధాన్ని పేరిందేవి నిజమనుకునేలా చెయ్యాలి. తనూ కొంత తృప్తిపడాలి. స్నేహితురాలిని కూడా తృప్తిపరచాలి. ఇందుకు ఎవర్ని ఎన్నుకోవాలి?

నీరజకు తమ ఆఫీసులోనే ఉద్యోగం చేసే సుందరం గుర్తుకువచ్చాడు. అతనికి ముప్ఫయ్ ఐదేళ్ళుంటాయి. పెళ్ళయ్యింది కూడా.

సుందరం తనని అర్థం చేసుకుంటాడా? అర్థం చేసుకోవచ్చు. మంచివాడే. మిగిలిన వాళ్ళంతా తనక్టే చిన్నవాళ్ళు. బాగా పెద్దవాళ్ళు. అతనొక్కడే తన భర్త వేషానికి సరిగ్గా సరిపోతాడు. అతడినే అడగాలని అనుకుని నిద్రపోయింది నీరజ మరేమీ ఆలోచించకుండానే.

లంచ్‌టైంలో ఎవరూ లేనప్పుడు సుందరాన్ని అడిగింది నీరజ "సాయంత్రం ఏడు గంటలకు రాఘవయ్య పార్కుకు వస్తారా?" మీతో కొంచెం మాట్లాడాలి".

అతను ఆమెవంక ఆశ్చర్యంగా చూసి "నాతో మాట్లాడాలా?" అని అడిగాడు.

"అవును. చాలా ముఖ్యమైన విషయం. ప్లీజ్ రండి.... అంతా అక్కడ చెబుతాను" రిక్వెస్టింగ్‌గా అన్నది.

సరేనన్నాడు సుందరం.

సుందరం తనని అపార్థం చేసుకోడని తెలుసు. తనమీద ఆఫీసులో అందరికీ మంచి అభిప్రాయమే వుంది.

చెప్పినట్టుగానే సుందరం పార్కులో నీరజను కలిశాడు. ఇద్దరూ ఓ చోట కూర్చున్న తర్వాత తనకు వచ్చిన సమస్య గురించీ, అందుకు దారితీసిన కారణాల గురించీ వివరంగా చెప్పింది ఆమె.

మళ్ళీ ఆశ్చర్యపోయాడు సుందరం.

"చిత్రమైన సమస్య" అన్నాడు.

"అవును. ఈ సమస్య నేను సృష్టించుకున్నం సుందరం గారూ.... ఇలాంటి పరిస్థితి వస్తుందని నేనెప్పుడూ వూహించలేదు. కానీ ఇప్పుడు వచ్చింది. మీరు నాకోసం ఓ అరగంట నా భర్తగా నటించి నాకు సహాయం చెయ్యండి.... మీరు సహృదయంతో నన్నర్థం చేసుకుంటారని ఇలా నటించడానికి నేను మిమ్మల్ని ఎంచుకున్నాను" అన్నది నీరజ.

అందుకు సుందరం ఒప్పుకున్నాడు.

అతను ఎంతమేరకు నటించాలో చెప్పింది. తనని ఎలా పిలవాలో, ఎలా

ప్రవర్తించాలో వివరించింది.

సుందరం నవ్వి "పెళ్ళయినవాడ్ని. నా పాత్రకు నేను న్యాయం చేస్తానులెండి" అన్నాడు. రైలు స్టేషనులో మరురోజు అతను తనని ఏ టైముకు కలుసుకోవాలో చెప్పింది నీరజ.

తర్వాత ఇద్దరూ విడిపోయారు.

ఆ రాత్రి నీరజ తృప్తిగా నిద్రపోయింది. తల్లి ఆరోజు కూడా ఊర్నించి రాదని తెలుసు. ఆమె ఇంట్లో లేకపోవటమే అన్నివిధాలా మంచిది. బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్ రావటానికి పావుగంట ముందు స్టేషన్‌కు వెళ్ళింది నీరజ. ఆమె వెళ్ళిన ఐదు నిమిషాలకు సుందరం అక్కడి వచ్చాడు.

"ఒకప్పుడు నాటకాల్లో నటించిన అనుభవం ఇప్పుడు ఉపయోగపడుతోంది" అన్నాడు సుందరం.

"నాకు ఆ అనుభవం కూడా లేదు. ఎలా నటిస్తానో.... భయంగా వుంది.... బెరుగ్గా వుంది" అన్నది. ఇంతలో బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్ రానేవచ్చింది.

ఎంట్రెన్స్ దగ్గరే నిలబడిన పేరిందేవిని సులభంగానే గుర్తించింది నీరజ. చెయ్యి వూపింది. భుజానికి ఎర్‌బేగ్, చేతిలో సూట్కేసుతో రైలు దిగింది పేరిందేవి.

"నీలో పెద్దగా మార్పు లేదు. కొంచెం లావయ్యావ్. ఈజీగానే గుర్తుపట్టాను. ఇంతకీ నీ పతిదేవుడేడీ?" అన్నది నీరజ చిన్నగా నవ్వుతూ.

"ఏం పతిదేవుడో.... అంతులేని బాధతో నన్ను రైలెక్కించాడు. ఆఫీస్ ఇన్‌స్పెక్షన్ అంటూ ఓ బృందం వచ్చింది. లీవ్ ఇవ్వమన్నారు.

నేను కూడా మానేద్దామని అనుకున్నాను. కానీ ఖమ్మంలో మాకు బాగా దగ్గరి బంధువుల ఇంట్లో పెళ్ళి ఈ రాత్రికే. చివరకు నేనొక్కదాన్నే వచ్చాను. సారీ.... మరి ఇంతకీ నీ పతిదేవుడూ" అంటూ నీరజ పక్కనే వున్న సుందరాన్ని చూసింది.

"ఈయనే.... గోపాల సుందరం. నా బెటర్ హాఫ్.... నీ భాషలో పతిదేవుడు" అంటూ నవ్వింది.

పేరిందేవి అతనికి నమస్కారం చేసింది. సుందరం కూడా నమస్కారం చేసి "మీతోపాటు ఆయన కూడా వస్తే చాలా బావుండేది.... నీరూ మీ ఇద్దరి గురించీ ఎప్పుడూ చెబుతూవుండేది. మీ ఉత్తరం వచ్చిన దగ్గర్నించీ మీ ఇద్దరినీ చూడాలని ఇద్దరం చాలా కుతూహలంగా వున్నాం" అన్నాడు సుందరం.

"ఈసారి తీసుకువస్తాను" అన్నది పేరిందేవి. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేంటిన్ దగ్గిరికి వెళ్ళారు.

కాఫీ తాగుతున్నప్పుడు "నీలో ఏమంత మార్పు రాలేదే నీరూ.... రహస్యం యేమిటి? డైటింగ్‌గానీ చేస్తున్నావా?" అని అడిగింది.

"అలాంటిది ఏమీ లేదండీ.... అన్నీ టైం ప్రకారం చేస్తుంది. మీ ఫ్రెండ్ ఉదయం ఇద్దరం వాకింగ్‌కు వెళతాం" అని చెప్పాడు సుందరం.

"గుడ్. అది చాలా మంచి అలవాటు" అన్నది పేరిందేవి మెచ్చుకోలుగా.

"మీరు ఇంకో ట్రెయిన్‌కు వెళ్ళవచ్చు. ఇప్పుడు మాతో మా ఇంటికి రాకూడదూ?" అన్నాడు సుందరం. ఉలిక్కిపడింది నీరజ. "ఇప్పుడు కాదు సుందరంగారూ.... వాళ్ళు నాలుగు రోజులు ముందు రమ్మన్నారు. మరోసారి ఇద్దరం తప్పకుండా వస్తాం" అన్నది.

కబుర్లతో కాలం గడిచిపోయింది.

ఖమ్మంవైపు వెళ్ళే రైలు వచ్చింది. ఎక్కింది పేరిందేవి.

"మీ ఇద్దరినీ కలుసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది. మీ జంట బావుంది. మేడ్ ఫర్ ఈచదర్‌లా వున్నారు. పిల్లలు కూడా వుంటే బావుండేది. దురదృష్టం. మాకూ లేరు" అన్నది అదోలా. ఎవ్వరూ మాట్లాడలేదు.

నీరజ ఇంకో ఐదు నిమిషాల్లో రైలు బయల్దేరుతుందనగా "రైల్లో బోరుకొట్టకుండా మా ఫ్రెండ్‌కు ఏయినా మేగజైన్లు తీసుకురండి" అన్నది సుందరంతో.

బుక్ స్టాల్‌వైపు వెళ్ళాడు సుందరం.

అతను వెళ్ళాక నీరజతో ఇలా అన్నది పేరిందేవి కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకుంటూ.

"నన్ను క్షమించు నీరూ.... ఇంక నీ దగ్గర నటించలేను. నాకింకా పెళ్ళి కాలేదు. నన్ను ప్రేమించినవాడు నన్ను మోసం చేసి పారిపోయాడు. నేను అల్లరిపాలయ్యాను. ఇప్పటివరకూ పెళ్ళి కాకుండా వుండిపోయాను. నీ దృష్టిలో గొప్పగా వుండాలని అలా ఉత్తరాలు రాశాను. మీ ఇద్దరినీ చూసిన తర్వాత నిజం చెప్పాలనిపించింది. ప్లీజ్ నీరూ.... నన్నర్థం చేసుకో".

అప్పుడు కూడా తన గురించిన నిజాన్ని స్నేహితురాలికి చెప్పలేకపోయింది నీరజ. ❖

*స్వాతి వారపత్రిక, 20-8-1999*